క్లుప్తంగా

క్రికెట్ కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ యూత్‌తో పాటు, యువజన సంఘాలకు బుధవారం ఆయన క్రికెట్ కిట్లను అందజేశారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలని సూచించారు. నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, శ్రీకాంత్, మహేశ్, రాఘవేందర్, మధు, పవన్, చింటూ, శివ, రాఘవ తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

తుర్కయంజాల్: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కాంగ్రెస్ నేత మల్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ, ఇంజాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మల్రి నిరంజన్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా.. ఆయన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొక్క శ్రీలత, ప్రధానోపాధ్యాయులు సిమ్లానాయక్, జ్యోతి, నాయకులు సామ భీంరెడ్డి, మేతరి దర్శన్, ఎంఎన్ఆర్ యువసేన అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తుర్కయంజాల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడకు చెందిన గోదాసు విజయ, దూస శ్రీను, కొత్త మణెమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మండల రైతుబంధు కోఆర్డినేటర్ కందాల బల్‌దేవ్‌రెడ్డి, వార్డు కమిటీ అధ్యక్షుడు బుడ్డ విజయ్‌బాబు, పల్లపు అంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉండాలి

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హిందూముస్లిం సమైక్యత సమావేశం నిర్వహించారు. జైహో కార్యదర్శి కొమ్మురాజు హిందూముస్లిం సమైక్యత గురించి వివరించారు. అందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సమైక్యత ప్రతిజ్ఞ నిర్వహించారు. గోవింద్, లావణ్య, రాజు, అనుసూయ, తులసీ, మహేశ్, దివ్య తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కడ్తాల్: కొలుకులపల్లి రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన ఆకుతోట రాములు జ్ఞాపకార్థం.. ఆయన సతీమణి భారతమ్మ, కుమారుడు శ్రీనివాస్ రూ.51 వేలు, దుర్గామాత ఆలయ అభివృద్ధికి రూ.11 వేల విరాళం ప్రకటించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.10,100 విరాళం ప్రకటించారు. బుధవారం ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికి విరాళం అందజేశారు. స్థానిక నాయకులు ఉన్నారు.

సాలాపూర్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాలార్‌పూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడలతో స్నేహబంధం మెరుగుపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. క్రీడాకారులకు ఐక్యత ఫౌండేషన్ తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, నాయకులు మోహన్, శ్రీను, గోపాల్, చందు, మల్లేశ్, రమేశ్, భీమా ఉన్నారు.

పూర్తి పనిదినాలు కల్పించండి

'క్రిడా' ఎదుట ఒప్పంద కార్మికుల ధర్నా

యాచారం: 20 ఏళ్లుగా గునుగల్ క్రిడా క్షేత్రంలో వ్యవసాయ సాగులో విధులు నిర్వర్తిస్తున్నాం. ఎప్పుడూ లేనిది ప్రతి శనివారం ఎందుకు పని బంద్ చేస్తున్నారని ఒప్పంద కార్మికులు ఆందోళనకు దిగారు. సాగర్ రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతంలో ఉన్న కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో 20 ఏళ్లుగా యాచారం, గునుగల్, చౌదర్‌పల్లి, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాలకు చెందిన 50 మందికి పైగా వ్యవసాయ పనుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి ఆదివారం సెలవు దినంగా పాటించేవారు. కాని కొద్దివారాలుగా ఆదివారంతో పాటు శనివారం కూడా సెలవు దినంగా ప్రకటిస్తున్నారు. దీంతో కార్మికులు ఆదివారం మాత్రమే సెలవు దినంగా ప్రకటించాలని.. శనివారం పనిదినంగా పరిగణించాలని డిమాండ్ చేస్తు ప్రధాన గేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. గతంలో మాదిరిగా నెలకు 26 రోజుల పనిదినాలు కల్పించాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలలకు మహర్దశ

- మనఊరు-మనబడితో మౌలిక వసతుల కల్పన
- ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, కిషన్‌రెడ్డి



కడ్తాల్: పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఇబ్రహీంపట్నం: పాఠశాలలో కిచెన్ షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడితో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చల్లంపల్లి, సాలార్‌పూర్, టాక్‌రాజ్‌గూడ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. ముందుగా చల్లంపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంతో పాటు, టాక్ రాజుగూడలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం సాలార్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మనఊరు-మన బడి పథకంలో భాగంగా రూ.16లక్షలతో నిర్మిచిన అదనపు గదులతో పాటు, పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. మన ఊరు-మన బడి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7300 కోట్లతో రాష్ట్రంలోని 8500 పాఠశాలలో మొదటి విడతగా 12 రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 324 పాఠశాలలు ఉండగా.. మొదటి విడతగా రూ.69 కోట్లతో 108 పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 100 శాతం పాఠశాలలను ఆధునీకరించి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణయాదవ్, హరిచంద్‌నాయక్, విజయలక్ష్మీ, ఎంపీటీసీలు ప్రియా, మంజుల, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, ఎస్ఎంసీ చైర్మన్ బాబా, ఎంఈఓ సర్దార్‌నాయక్, సీడీపీఓ సక్కుబాయి, డీఈ తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈలు పరమేశ్, శ్రావ్య, ఏఓ శ్రీలత, నోడల్ అధికారి జంగయ్య, హెచ్ఎం ఖలీల్ అహ్మద్, స్థానిక నాయకులు ప్రకాశ్, రాజేందర్‌యాదవ్, పత్యానాయక్, సాయిలు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ..

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ ప్రాథమిక పాఠశాలలో రూ.18 లక్షలతో చేపట్టిన పాఠశాల మరమ్మతులు, తాగునీరు సౌకర్యం, పెయింటింగ్ తదితర నిర్మాణాలతో పాటు నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, తగినంత ఫర్నీచర్, ల్యాబ్‌లను ఈ పథకం కింద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దశల వారిగా అన్ని పాఠశాలలను ఈ పథకం కిందకు తీసుకొచ్చి అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేశ్, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్లు జ్యోతి, విశాల, సునీత, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన లచ్చయ్య (64) అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్టు ద్వారా రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జ్యోతయ్య, శేఖర్, వెంకటయ్య, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన గోవిందమ్మ గాయపడి ఇంటివద్ద కోలుకుంటుంది. బాధితురాలిని బుధవారం ఉదయం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యాదగిరి, రాఘవేందర్, లింగం, శివ పరామర్శించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి సహకారంతో బాధితురాలికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక నాయకులు మధు, శ్రీశైలం, గాంధీ, నరేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి జాతర ప్రారంభం

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయ ప్రధాన అర్చకులు మేళ్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. నాయకులు, భక్తులు ఉన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందామని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గిరిజన కమ్యూనిటీ భవనంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు సంబంధిం గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన జాతి ఐక్యత కోసం పోరాడిన సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని ఈనెల 15న అత్యంత భారీ ఎత్తున్న నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గిరిజనులు వేలాదిగా తరలి రావాలని వారు కోరారు. మండల కేంద్రంలో గిరిజన కమ్యూనిటీ భవనం నిర్మించిన అప్పటి కడ్తాల్ సర్పంచ్ శారద బీచ్యానాయక్‌ను ఈసందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, రాములునాయక్, పాండునాయక్, సేవ్యానాయక్, శ్వేతా భూనాథ్‌నాయక్, ఉప సర్పంచ్‌లు శారద, జగన్, రమణ, శ్రీను, గోపి, నాయకులు ఉన్నారు.

అక్రమ బదిలీలను అడ్డుకోండి

ఇబ్రహీంపట్నం: ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాలోకి అక్రమ బదిలీలను ఆపాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి పీఆర్టీయూటీఎస్ నేతలు విన్నవించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు సంఘం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్, రాజు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. దొడ్డిదారిన రంగారెడ్డి జిల్లాకు బదిలీలు చేయించుకోవాలని కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ బదిలీలను ఆపి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలన్నారు. జీఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన స్థానిక ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాలకు రప్పించాలని విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

బాధితులకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్

యాచారం: బీఆర్ఎస్ రాష్ట్ర నేత క్యామ మల్లేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కృషితో గడ్డమల్లయ్యగూడలో సమస్య సద్దుమణిగింది. గ్రామంలో మంగళవారం రాత్రి.. ప్రగతి నివేదన పాదయాత్ర సభలో ప్రమాదంలో మృతి చెందిన నర్రె జంగయ్య, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబ సభ్యులతో బుధవారం క్యామ మల్లేశ్, కొత్తకుర్మ సత్తయ్య సమావేశమై చర్చించారు. గ్రామ సర్పంచ్ అచ్చెన జంగయ్య ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా క్షతగాత్రులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గడ్డమల్లయ్యగూడవాసులు శాంతించారు.ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన నర్రె జంగయ్య మృతదేహానికి బుధవారం గ్రామంలో అంత్యక్రియలు జరిపారు. అంతకు ముందు క్యామ మల్లేశ్, కొత్తకుర్మ సత్తయ్య ఇబ్రహీంపట్నంలోని ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: యేండ్ల తరబడిగా భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడే జంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం హఫీజ్‌పుర రెవెన్యూ రైతులు బుధవారం ఈ మేరకు నిరసన చేపట్టారు. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ... హఫీజ్‌పుర రెవెన్యూ సర్వేనం 36 నుంచి 48లో 450 మంది సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నరన్నారు. వారికి నేటికి పట్టాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనికితోడు వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతు సంఘం రైతుల పక్షాన నిలబడుతుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం కార్యదర్శి ముసలయ్య, అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వెంకటేష్, గుడెటి వెంకటేష్, రవీ, లింగస్వామి, నాగేశ్వర్‌రావు, రమేష్, యాదగిరి, మంకు జంగయ్య, లింగం పాల్గొన్నారు .

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆదిబట్ల సీఐ రమికుమార్ మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయకూడదన్నారు. ఫొటోలు షేర్ చేయడం ద్వారా మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. బ్యాంకు ఓటీపీలు షేర్ చేయడం, గిఫ్ట్ మెసేజ్, ఫేక్ మేసేజెస్ వస్తే లింకులపై క్లిక్ చేయడం వలన ఖాతాలో నగదు మాయం అయ్యే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత వివరాలను గోప్యంగా పెట్టుకోవాలని ఇతరులకు షేర్ చేయకూడదన్నారు. ఇటీవల లోన్ యాప్స్ వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ప్రైవేటు లోన్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకొవద్దన్నారు. ఇన్‌స్ట్రాగాం, ఫేస్‌బుక్‌లో ఇతరుల ఫొటోలు పెట్టుకొని మోసం చేస్తారని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారయణ, ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ రాజు, సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ రాజు, ఏజీఎం మల్లికార్జున్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- సాగర్ రోడ్డుపై విపక్ష నేతల ధర్నా



గునుగల్ గేటు వద్ద రోడ్డుపై బైఠాయించిన మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

యాచారం: గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ప్రగతి నివేదన పాదయాత్ర సభలో ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన నర్రె జంగయ్య, తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలను ఆదుకోవాలని రాజకీయ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి యాచారం మండలంలో ప్రగతి నివేదన పాదయాత్ర ముగించుకుని మంగళవారం రాత్రి గడ్డమల్లయ్యగూడ గ్రామంలో సభ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నర్రె శంకరయ్య మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపి సభలో ఉన్న ప్రజలపైకి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. ఈ సంఘటనలో గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన నర్రె జంగయ్య(80) మృతిచెందగా... చింతపల్లి విజయమోహన్‌రెడ్డి, ఇక్క లచ్చయ్య, నర్రె భారతమ్మ, అచ్చెన మల్లమ్మ, నర్రె బీరయ్య, ఇక్క రాములమ్మ, వరికుప్పల నర్సమ్మ, ఇక్క భోగురమ్మ, ఇక్క మల్లమ్మతో పాటు చింతుల్ల గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి గాయపడ్డారు.

సాగర్‌రోడ్డుపై ఆందోళన..

ప్రగతి నివేదన పాదయాత్రలో ప్రమాదానికి గురై మృతి చెందిన నర్రె జంగయ్య, మిగితా క్షతగాత్రుల కుటుంబాలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదుకోవాలని డిమాండ్ చేస్తు బుధవారం కాంగ్రెస్, బీజేపీతో పాటు పలు రాజకీయ పక్షాల నాయకులు గునుగల్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాషా, యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- ప్రజా సమస్యలపై ఏకరువు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంగా ఏర్పడి ఆరున్నరేళ్లు కావొస్తున్నా అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని.. చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతి కన్పించడం లేదని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ మండల సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నూతన భవనాల నిర్మాణ పనులు, రైతుల భూ సమస్యలు, ప్రజా సమస్యలను పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోయారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే వివిధ శాఖల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించగా.. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ప్రతి 3 నెలల కొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాల్లో చేసిన తీర్మాణాలు అమలు కావడం లేదని.. దీంతో సమస్యల పరిష్కారంపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, నిర్మలాదేవి, సర్పంచ్‌లు శంకర్, యాదయ్య, పాండునాయక్, సుగుణ, భాగ్యమ్మ సభ దృష్టికి తెచ్చారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో 250 మంది విద్యార్థులు ఇరుకుగదుల్లో ఇబ్బందుల మధ్య విద్యనభ్యసిస్తున్నారని కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లు గడిచినా నేటికి పూర్తికాలేదని జెడ్పీటీసీ ప్రశ్నించారు. గ్రామాల్లోని సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు.

రైతుల ఇక్కట్లు తీర్చాలి..

కడ్తాల్ మండలంలో రైతులకు సంబంధించిన వేలాది ఎకరాల పట్టా భూమి ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో ఉంచడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మండిపడ్డారు. పంచాయతీల్లో అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని.. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ రామకృష్ణ, డీఈ తిరుపతిరెడ్డి, ఏఈలు పరమేశ్, శ్రావ్య, నిఖిల, సీడీపీఓ సక్కుబాయి, ఎంఈఓ సర్దార్‌నాయక్, ఎంపీఓ మధుసూధనచారి, ఏఓ శ్రీలత, అధికారులు ఉన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి
- మంచాలకు చేరుకున్న ప్రగతి నివేదన పాదయాత్ర



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర బుధవారం ఉదయం మంచాల మండలంలోని రంగాపూర్ గ్రామానికి చేరుకుంది. రంగాపూర్-చీదేడ్ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. రంగాపూర్ గ్రామం చేరుకోగానే మంచాల బీఆర్ఎస్ అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం రంగాపూర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాను మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి...

పాదయాత్ర అనంతరం చీదేడ్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై అనత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు. 15 సంవత్సరాలుగా నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటు ఉంటూ వారి కష్ట, సుఖాల్లో పాలుపంచుకున్న నాయకుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మొద్దు సికిందర్‌రెడ్డి, నాయకులు దండేటికార్ రవి, జంగారెడ్డి, వెంకటేశ్, జంబుల కిషన్‌రెడ్డి, సుకన్య, అనిత, యువజన విభాగం మండల అధ్యక్షుడు బద్రినాథ్ గుప్తా, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీ పాష, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రంగాపూర్‌లో వృద్ధులతో ముచ్చటిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి